సాక్షి
నంద్యాల
మంగళవారం ; 23 ; జనవరి ; 2024



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. మండపంలో వెయ్యి దీపాలను అర్చకులు వెలిగించారు.



..అక్రమ వసూళ్లు

కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల వద్ద ఉన్న అంతర్రాష్ట్ర ఆర్‌టీఏ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు తేల్చారు. 10లో▸



'సెబ్'లో భారీగా బదిలీలు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో భారీగా బదిలీలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు సీఐ, ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. 10లో▸

న్యూస్‌రీల్

కమనీయం పార్వేట మహోత్సవం



మర్రిపల్లెకు చేరుకున్న ఉత్సవ పల్లకీ

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పార్వేట మహోత్సవం ఊరూరా వైభవంగా కొనసాగుతోంది. కొండ దిగిన ఉత్సవ పల్లకీ సోమవారం మర్రిపల్లె గ్రామంలో విశేష పజలు అందుకుంటూ ఊరేగుతోంది. కోటకందుకూరు నుంచి ఆదివారం అర్ధరాత్రి ప్రహ్లాదవరద స్వామి, జ్వాలనరసింహ స్వాములు కొలువైన ఉత్సవ పల్లకీ మర్రిపల్లెకు చేరుకుంది. గ్రామ ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి ఉత్సవ పల్లకీకి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీని గ్రామస్తులు భుజాలపై మోసుకుంటూ తెలుపులపై కొలువుంచి భక్తిని చాటుకున్నారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చియార్డులో ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. సోమవారం సూపర్-10, తేజ రకాలతో పాటు సూపర్-5 రకం మిర్చి అమ్మకాలు జరిగాయి. సూపర్-10 రకం గరిష్ట ధర క్వింటాలు రూ.18,000, మధ్యస్థ ధర రూ.15,000, కనిష్ట ధర రూ.14,200 పలికింది. ఇదే రకం తాలుకాయ గరిష్ట ధర క్వింటాలు రూ.8,000, మధ్యస్థ ధర రూ.5,000, కనిష్ట ధర రూ.4,500 గా నమోదైంది. ఇక తేజ రకం గరిష్ట ధర క్వింటాలు రూ.17,500, మధ్యస్థ ధర రూ.17,500, కనిష్ట ధర రూ.16,800 గా పలికింది. సూపర్-5 రకం గరిష్ట ధర క్వింటాలు రూ.17,000, మధ్యస్థ ధర రూ.15,500, కనిష్ట ధర రూ.13,500 గా నమోదైనట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారస్తుల వద్ద సరకు అమ్ముకుని మంచి ధరను పొందాలని సూచించారు.

జిల్లాలో 96 శాతం ఈ - క్రాప్ నమోదు



నర్సిపల్లెలో పంట కోత ప్రయోగం పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

ఉయ్యాలవాడ: జిల్లా వ్యాప్తంగా రబీలో సాగైన పంటలకు సంబంధించి 96 శాతం ఈ - క్రాప్ నమోదు పూర్తయిందని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు తెలిపారు. సోమవారం మండలంలోని నర్సిపల్లె గ్రామంలో రైతు పల్లె గురుప్రసాద్‌రెడ్డి సాగు చేసిన 5 ఎకరాల విస్తీర్ణంలో 5 మీటర్లలో పప్పు శనగ పంటలో పంట కోత ప్రయోగం చేయగా 2.325 కేజీలు దిగుబడులు వచ్చాయన్నారు. ఇప్పటికే జిల్లాలో 15 మండలాల్లో 52 పంట కోత ప్రయోగాలు నిర్వహించడం జరిగిందన్నారు. వర్షాభావ పరిస్థితులతో ఎకరాకు 2 నుండి 3 క్వింటాళ్లలోపు దిగుబడులు వస్తున్నాయన్నారు. నివేదికలను ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. అలాగే రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 4,47,361 ఎకరాలకుగాను 2,91,567 ఎకరాల్లో పలు రకాల పంటలను అన్నదాతలు సాగు చేశారన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు 2,74,938 ఎకరాల్లో పంట నమోదు జరిగినట్లు పేర్కొన్నారు. పంట నమోదు చేసుకున్న 22,281 మంది రైతులకు సంబంధించిన 85,528 ఎకరాల్లో ఈకేవైసి ప్రక్రియ సైతం పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. అనంతరం ఉయ్యాలవాడలో రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ఏఈఓ రాణెమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కులగణన సర్వే



పాణ్యంలో సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో ఇప్పటి వరకు 1,59,717 కుటుంబాలకు సంబంధించిన కులగణన పూర్తయినట్లు డీఎల్‌డీఓ మురళీకల్యాణి సోమవారం తెలిపారు. 8,265 క్లస్టర్లలో 3,53,729 మందికి కులగణన జరిగిందన్నారు. ఇప్పటి వరకు 26.85 శాతం గణన పూర్తయిందని, మిగిలిన ప్రాంతాల్లో నిర్వహించే కులగణనకు ప్రజలు సహకరించాలని కోరారు.

మహిళలే నిర్ణేతలు

- తుది ఓటరు జాబితా విడుదల
- జిల్లాలోని ఓటర్ల సంఖ్య 13,72,091
- పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువ
- ఫారం-6,7,8లపై పారదర్శకంగా విచారణ
- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు



నంద్యాల(అర్బన్): రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్లు నిర్ణేతలుగా మారనున్నారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఉండగా.. అన్నింటిలోనూ తరుణీమణుల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు, నంద్యాల, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో వీరి తీర్పు కీలకం కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారులు సోమవారం తుది ఓటరు జాబితాను ప్రకటించారు. మొత్తం ఓటర్లు 13,72,091 మంది ఉండగా.. ఇందులో మహిళలు 6,98,404 పురుషులు 6,73,425, ఇతరులు 262 మంది ఉన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం పురుషుల కంటే మహిళలు 24,979 మంది ఎక్కువగా ఉన్నారు. తుది ఓటరు జాబితాను కలెక్టరేట్, ఆర్‌డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతోపాటు గుర్తించిన 2,186 పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నారు. 18-19 సంవత్సరాల మధ్య యువ ఓటర్లు 30,160 మందిని ఓటరు జాబితాలో చేర్చారు. 8వేల మంది చెంచు జనాభాలో 5,454 మంది మందిని ఓటర్లుగా నమోదు చేశారు.

14,093 మంది ఓటర్ల పెరుగుదల

2024లో జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ముందుగానే ఓటరు జాబితా రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. 2023 జులై 21 నుంచి 2024 జనవరి 22వ తేదీ వరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)-2024 కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి వివరాలు సేకరించి, ఫారం-6, 7, 8లను స్వీకరించారు. 2024 ముసాయిదా జాబితా ప్రకారం 13,57,998 మంది ఓటర్లు ఉండగా తుది ఓటరు జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 13,72,091గా నమోదైంది.

➡ జిల్లాలో అత్యధికంగా ఓటర్ల పెరిగిన నియోజకవర్గంగా ఆళ్లగడ్డ నిలిచింది. గతంలో మొత్తం ఓటర్లు 2,25,741 మంది ప్రస్తుతం తుది జాబితా ప్రకారం 2,518 మంది పురుష ఓటర్లు, 2,659 మహిళా ఓటర్లు, నలుగురు ఇతరుల ఓటర్లను చేర్చడంతో నియోజకవర్గంలో 5,173 మంది పెరిగి మొత్తం 2,30,914కు చేరింది.

➡ డోన్ నియోజకవర్గంలో కేవలం 326 మహిళా ఓటర్లు మాత్రమే కొత్తగా చేరగా, 291 మంది పురుష, 9 మంది ఇతరుల ఓట్లను తొలగించారు. గతంలో మొత్తం ఓటర్లు 2,24,085 మంది ఉండగా అందులో పురుష ఓటర్లు 1,10,748 కాగా మహిళా ఓటర్లు 1,13,259 మంది ఉన్నారు. ఇతరులు 78 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 26 మంది ఓటర్లు పెరిగి 2,24,117కు చేరింది.

➡ శ్రీశైలం నియోజకవర్గంలో గతంలో మొత్తం ఓటర్లు 1,92,942 మంది ఉండగా అందులో పురుష ఓటర్లు 94,736 కాగా మహిళా ఓటర్లు 98,166 మంది ఉన్నారు. ఇతరులు 40 మంది ఉన్నారు. తుది జాబితా ప్రకారం 174 మంది పురుష ఓటర్లు, 843 మహిళా ఓటర్లు, ముగ్గురు ఇతరులను నమోదు చేయడంతో మొత్తం 1,020 మంది పెరిగారు.

➡ నందికొట్కూరు నియోజకవర్గంలో తుది జాబితా ప్రకారం 929 మంది పురుష ఓటర్లు, 1894 మహిళా ఓటర్లు, 5మంది ఇతరులను నమోదు చేయడంతో నియోజకవర్గంలో మొత్త 2, 828 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది.

➡ నంద్యాల నియోజకవర్గంలో తుది జాబితా ప్రకారం 2,200 మంది పురుష ఓటర్లు, 2,746 మహిళా ఓటర్లు, ముగ్గురు ఇతరులను నమోదు చేయడంతో మొత్తం 4,949 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది.

➡ బనగానపల్లె నియోజకవర్గంలో తుది జాబితా ప్రకారం 580 మంది పురుష ఓటర్లు, ఏడుగురు ఇతరుల ఓట్లను తొలగించారు. 684 మహిళా ఓటర్లు కొత్తగా నమోదు చేసుకోగా నియోజకవర్గంలో మొత్తం 97మంది ఓటర్ల సంఖ్య పెరిగింది.

మార్పులు.. చేర్పులు ఇలా

నంద్యాల జిల్లాలో కొత్త ఓటర్లు 14,093 మంది నమోదు కాగా వారిలో మహిళలు 9,152 మంది, పురుషులు 4,950 మందిని చేర్చారు. గత జాబితాతో పోలిస్తే తొమ్మిది మంది ఇతరులను తొలగించారు. అత్యధికంగా నంద్యాల నియోజకవర్గంలో అత్యధికంగా మహిళ ఓటర్లు 2,746 మంది జాబితాలోకి ఎక్కారు. అత్యల్పంగా డోన్ నియోజకవర్గంలో 326 మంది చేరారు. పురుష ఓటర్ల పరంగా చూస్తే అత్యధికంగా డోన్‌లో 291 మందిని, బనగానపల్లెలో 580 మందిని తొలగించారు. అత్యధికంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 2,518 మంది నమోదు చేసుకోగా, అత్యల్పంగా శ్రీశైల నియోజకర్గంలో 174 మంది నమోదయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు పకడ్బందీగా జాబితా రూపొందించారు. అనుమానపు ఓటర్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తుది జాబితాను ప్రచురించారు. అత్యధికంగా ఓటర్లు ఉన్న కుటుంబాలను గుర్తించడం, డూప్లికేట్ ఓటర్లు అయితే తొలగించడం, నిజంగా అర్హులైతే ఓటు హక్కును కల్పించారు

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆళ్లగడ్డ	1,14,311	1,16,589	14	2,30,914
శ్రీశైలం	94,910	99,009	43	1,93,962
నందికొట్కూరు	1,06,125	1,10,417	17	2,16,559
నంద్యాల	1,30,278	1,37,273	94	2,67,645
బనగానపల్లె	1,17,344	1,21,531	25	2,38,900
డోన్	1,10,450	1,13,585	69	2,24,117
మొత్తం	6,73,425	6,98,404	262	13,72,091

పారదర్శకంగా తుది జాబితా



తుది జాబితా ప్రతులను రాజకీయ నాయకులకు అందజేస్తున్న కలెక్టర్

జిల్లాలో స్వచ్ఛమైన, పారదర్శకమైన తుది ఓటరు జాబితాను రూపొందించామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తుది ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి జాబితా ప్రతులను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్యలతో కలిసి అందజేశారు. జిల్లాలో మొత్తం 13,72,091 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 6,73,425 మంది పురుష ఓటర్లు కాగా 6,98,404 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. 262 మంది ఇతరులు ఉన్నారని, 1,706 పోలింగ్ స్టేషన్ల ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. గతంలో విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ జాబితా కంటే 14,093 మంది ఓటర్లు పెరిగారన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు, తొలగింపులు, చేర్పులను క్షేత్రస్థాయిలో డాక్యుమెంటేషన్ స్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. 17,723 ఫొటో సిమిలర్ ఎంట్రీస్, 2728 డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ కూడా సరి చేశామన్నారు. 10 మంది ఓటర్ల కన్నా ఎక్కువగా ఉన్న కుటుంబాలను క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన చేయించి ఓటరు జాబితాలో సరి చేశామన్నారు. కొత్తగా మార్పులు జరిగిన ఓటర్లకు సంబంధించి ఎపిక్ కార్డులను కూడా సిద్ధం చేశామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ తరపున అనిల్ అమృతరాజ్, కాంగ్రెస్ తరపున రియాజ్‌బాషా, టీడీపీ తరపున రమణారెడ్డి, శివరామిరెడ్డి, బీజేపీ తరపున ఉపేంద్రనాథ రెడ్డి, సీపీఎం తరపున నరసింహులు, బీఎస్పీ తరపున శ్రీనివాసులు, ఆమ్‌ఆద్మీ తరపున ప్రదీప్‌లు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' నగదు జమ

- జిల్లాలో 2.53 లక్షల లబ్ధిదారులకు రూ.167.41 కోట్లు

నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్ ఆసరా పథకం కింద జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని అక్కాచెల్లెమ్మలకు నాలుగో విడత నగదును వారి ఖాతాల్లో జమ అవుతుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం బటన్ నొక్కి బటన్ నొక్కి జమ చేయడం జరుగుతుందన్నారు. వర్చువల్‌గా జరిగే ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు వీక్షిస్తారన్నారు. నంద్యాల జిల్లాలోని ఆసరా 2.53 లక్షల ఆసరా లబ్ధిదారులకు రూ.167.41కోట్లను ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. ఇప్పటికే మూడు విడతల్లో నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని, నాల్గో విడత కూడా పంపిణీ చేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎంతో మేలు చేకూరుతుందని, స్వయం ఉపాధి రంగంలో రాణించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

• శ్రీరామం.. భక్తిపారవశ్యం



శ్రీరామ నామం మార్మోగింది. సోమవారం రాత్రి కర్నూలు నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవం కనుల పండువగా సాగింది. భారీగా తరలివచ్చిన భక్తులు ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించి తన్మయత్వం పొందారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సోమవారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తులు

నేటి నుంచి ఎఫ్‌ఏ -3 పరీక్షలు

- జిల్లాలో పరీక్షలు రాయనున్న 2.16 లక్షల మంది విద్యార్థులు
- మండల కేంద్రాలకు చేరిన ప్రశ్నాపత్రాలు



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎఫ్‌ఏ-3 పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు ఫార్మెటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ-3) పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 1వ తరగతి నుంచి 10 తరగతి విద్యార్థులకు ఈనెల 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ప్రశ్నపత్రాలు పంపిణీ చేశారు. ఈసారి టోఫెల్ పరీక్షలకు కూడా ప్రింటెడ్ ప్రశ్నపత్రాలు సరఫరా చేయడం గమనార్హం. 1 నుంచి 8 తరగతి వరకు ఓఎంఆర్ విధానం ద్వారా 9, 10 తరగతుల విద్యార్థులకు బైలింగ్వెల్ విధానంలో వారికి మీడియం వారీగా ప్రశ్నపత్రాలు అందజేస్తారు. ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూఆర్ కోడ్ కేటాయించారు. పేపర్లను ఎవరైనా లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం క్షణాల్లో బయటపడే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టారు.

గత ఏడాది మాదిరిగానే..

గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది పరీక్ష పేపర్ల మూల్యాంకనం, పరీక్ష పేపర్లను విద్యార్థులకు ఇచ్చి, వారి తల్లిదండ్రుల సంతకాలు తీసుకునేందుకు, మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు షెడ్యూల్ ఇచ్చింది. మార్చిలో ఫార్మేటివ్-4, ఏప్రిల్లో 1 నుంచి 9 తరగతులకు ఎస్ఏ-2, మార్చిలో పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు.

సాధారణ పరీక్షల మాదిరిగానే..

ఇంగ్లిష్ విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించేందుకు ప్రభుత్వం టోఫెల్ విద్యను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌సీ, స్మార్ట్ టీవీలు పాఠశాలల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించగా, తొలిసారి ప్రింటెడ్ పేపర్లను ఎస్‌సీఈఆర్టీ పంపిణీ చేసింది. సాధారణ పరీక్షల మాదిరిగానే ఇకపై టోఫెల్ పరీక్షను ప్రింటెడ్ పేపర్లలో విద్యార్థులు రాయనున్నారు.

పబ్లిక్ పరీక్ష తరహాలోనే నిర్వహణ

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారానే ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఎఫ్ఏ-3 పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే పరీక్ష పేపర్లను డీసీఈబీ ద్వారా మండల విద్యా కేంద్రాలకు చేరవేశాం. వీటికి సంబంధిత ఎంఈఓలు, స్కూల్ కాం ప్లెక్స్ హెచ్‌ఎంలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పది పబ్లిక్ పరీక్ష పేపర్ల మాదిరిగానే పరీక్షల తేదీల వారీగా ప్రశ్నపత్రాలను ట్రంకు బాక్సుల్లో భద్రపరిచారు.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

ఆన్‌'లైన్'లో మల్లన్న భక్తులు

- నెల రోజులు ముందుగానే దేవస్థాన వెబ్‌సైట్‌లో సేవా టికెట్లు
- భక్తులకు వరంగా మారిన ఆన్‌లైన్ సౌకర్యం
- ఎనిమిది నెలల్లో 5.68 లక్షల మంది భక్తులు సద్వినియోగం



శ్రీశైల ఆలయం



ఆన్‌లైన్‌సేవలు పొందేందుకు దేవస్థాన వెబ్‌సైట్

శ్రీశైలం టెంపుల్:శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు ఆర్జిత సేవా టికెట్లు సులభతరంగా పొందేలా దేవస్థానం అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ విధానానికి భక్తుల నుంచి ఆదరణ పెరుగుతోంది. శ్రీశైలంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు నిత్యం తరలివస్తారు. ఏ దేవాలయంలో లేనివిధంగా శ్రీశైలంలో మల్లికార్జునస్వామికి భక్తులు తమ తలను తాకించి (స్పర్శదర్శనం) చేసుకునే మహాభాగ్యం ఈ క్షేత్ర ప్రత్యేకత. అందుకే మల్లన్నను తాకి దర్శనం చేసుకోవాలని భక్తులు ఆరాటపడతారు.స్వామివారికి నిర్వహించే అభిషేకాలతో పాటు చండీహోమం,రుద్రహోమం, కుంకుమార్చన, స్వామిఅమ్మవార్ల కల్యాణం తదితర ఆర్జితసేవలను నిర్వహించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. గతంలో కరెంట్ బుకింగ్ ద్వారా టికెట్లు లభించేవి. అయితే భక్తులు ఎంతో ఆశతో క్షేత్రానికి వచ్చి క్యూలైన్లలో గంటల తరబడి వేచిఉండి కౌంటర్ వద్దకు రాగా టికెట్లు అయిపోవడంతో నిరాసతో తమ శ్రీశైల యాత్రను ముగించాల్సి వచ్చేది. ఈ క్రమంలో భక్తుల సూచనలు, సలహాల మేరకు దేవస్థానం గతేడాది మే 1వతేదీ నుంచి శ్రీశైల దేవస్థానం 25 ఆర్జితసేవలు,వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను 100 శాతం ఆన్‌లైన్‌లోనే పొందేలా చర్యలు చేపట్టింది. నెల రోజుల ముందుగానే భక్తులు ఆయా సేవా టికెట్లను పొందేలా దేవస్థానం ఆన్‌లైన్‌లో టికెట్లను అందుబాటులో ఉంచుతోంది. దేవస్థాన వెబ్‌సైట్ srisailadevasthanam. org ద్వారా భక్తులు ఆయా సేవా టికెట్లను పొందే అవకాశం ఉంది.తద్వారా ఎటువంటి దళారులను ఆశ్రయించకుండా,దళారులను నమ్మి అదనంగాడబ్బులు వెచ్చించకుండా దేవస్థానం పకడ్బంది చర్యలు చేపట్టింది.

పెరుగుతున్న ఆదరణ

గతేడాది మే 1వ తేదీ నుంచి శ్రీశైలంలో జరిగే అన్ని ఆర్జితసేవల టికెట్లను ఆన్‌లైన్‌లోకి తేవడంతో డిసెంబర్ నెలాఖరు వరకు 5,68,224 మంది భక్తులు ఆయా సేవా టికెట్లను పొంది సులువుగా మల్లన్న సేవలో తరించారు. అత్యధికంగా స్పర్శదర్శనం-3,82,796, గర్భాలయ అభిషేకం-16,439, సామూహిక అభిషేకం-65,015, అభిషేకానంతర దర్శనం-19,600, చండీహోమం-9,628, రుద్రహోమం-3,323, మృత్యుంజయహోమం-3,298, లీలాకల్యాణం-13,517 మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది సేవలను నిర్వహించుకున్నారు.

రోజు వారీగా కేటాయించిన ఆర్జిత సేవా టికెట్లు

శ్రీశైల క్షేత్రానికి రోజురోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఆయా సేవా టికెట్లను పరిమితి సంఖ్యలో కేటాయించి వాటిని ఆన్‌లైన్‌లోనే పొందేలా దేవస్థానం చర్యలు చేపట్టింది. ఉదయాస్తమానసేవ - 6, ప్రదోశకాలసేవ-6, స్పర్శదర్శనం - (3 విడతల్లో)-1575, గర్భాలయ అభిషేకం - 100, సామూహిక అభిషేకం - (రెండు విడతల్లో) - 1500, చండీహోమం-60, రుద్ర హోమం - 40, మృత్యుంజయహోమం - 20, లీలాకల్యాణం - 95, శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం - 100, కుంకుమార్చన - 400, వృద్ధ మల్లికార్జునస్వామి బిల్వార్చన-10, స్వర్ణపుష్పార్చన-6, సర్పదోష నివారణ-50, సాక్షిగణపతి హోమం -25, అక్షరాభ్యాసం-25, అన్నప్రాసన-25, వేదాశీర్వచనం-254, గోపూజ-300, నవావరణపూజ-6, ఉమామహేశ్వరస్వామి వ్రతం-30, ఇలా ప్రతిరోజు ఆయా సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో భక్తులు అందుబాటులో ఉంచారు.

భక్తులకు మెరుగైన సేవలు



శ్రీశైల యాత్రకు వచ్చే భక్తులు తయ యాత్రను ప్రణాళికబద్ధంగా నిర్వహించుకునేలా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు కల్పిస్తోంది. ఇందులో భాగంగా భక్తులు తమకు నచ్చిన రోజు, వెసులుబాటు ఉన్న రోజు ఏ ఆర్జిత సేవ నిర్వహించుకుంటారో ఆ సేవా టికెట్లును ఒక నెల రోజుల ముందుగానే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నాం. దేవస్థాన వెబ్‌సైట్‌లో లాగిన్ అయి సులభతరంగా టికెట్లు పొందవచ్చు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

స్పర్శ దర్శనం టికెట్లను పెంచాలి



శ్రీశైల దేవస్థానం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ సేవలు చాలా బాగున్నాయి. మేము ఎవరిని ఆశ్రయించకుండా మా ఇంటి నుంచే టికెట్లు పొందే అవకాశం బాగుంది. అలాగే గతంలో మాకు ముఖ్యమైన రోజుల్లో స్వామిఅమ్మవార్లను దర్శించుకోవాలంటే టికెట్లు దొరికేవి కావు. ఆఆన్‌లైన్ ద్వారా ముందుగానే మేము మాకు కావాల్సిన రోజు టికెట్లను బుకింగ్ చేసుకుంటున్నాం. స్పర్శదర్శనం టికెట్ల సంఖ్యను పెంచితే మరింత మంది భక్తులు స్వామివారిని దర్శించుకునే వీలుంటుంది.

– రాజేష్, భక్తుడు, హైదరాబాద్

కెనరా బ్యాంకు టర్నోవర్ రూ.22 లక్షల కోట్లపైనే


మాట్లాడుతున్న రవికుమార్

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు టర్నోవర్ రూ.22 లక్షల కోట్లు దాటిందని ఆ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ రవి కుమార్ తెలిపారు. టర్నోవర్‌లో జాతీయ స్థాయిలో కర్నూలు రీజియన్ 4వ స్థానంలో నిలువడం అభినందనీయమని పేర్కొన్నారు. సోమవారం మొదటిసారిగా కర్నూలుకు వచ్చిన ఆయనకు కర్నూలు రీజియన్ సెక్రటరీ పుష్పకుమార్, ఇతర నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కెనరా బ్యాంకు రీజినల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రీజియన్‌లోని అధికారులతో ముఖాముఖి మాట్లాడారు. బ్యాంకు ప్రగతిని సమీక్షించడంతో పాటు సమస్యలు తెలుసుకున్నారు. రీజియన్ సెక్రటరీ పుష్పకుమార్ వివిధ అంశాలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కెనరా బ్యాంకులో అన్ని వర్గాల వారికి అనుగుణంగా రుణ పథకాలు ఉన్నాయన్నారు. బ్యాంకు ప్రగతిని మరింత మెరుగుపరిచేందుకు మరింత చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. సీబీవోఏ నాయకులు రమాప్రసాద్, రాఘవన్, సత్యప్రకాశ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సంజామల: మండల పరిధిలోని కమలపూరి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో పంజాబ్ రాష్ట్రానికి చెందిన సుకిందర్ సింగ్ (38) మృతి చెందాడు. ఎస్ఐ నాగరాజు సోమవారం తెలిపిన వివరాల మేరకు.. బనగానపల్లె మండలం పసుపల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హార్వేస్టర్‌కు డ్రైవర్‌గా సుకిందర్ సింగ్ ఉన్నాడు. కమలపూరిల గ్రామంలో శనగ కోత పూర్తి చేసుకుని తిరుగు వస్తుండగా గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు హార్వేస్టర్‌కు తగలడంతో డ్రైవర్ సుకిందర్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు స్నేహితుడు భూపర్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





ఆదోని: రథంలో సీతారామ, లక్ష్మణుల ఉత్సవమూర్తులు, కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం, మహానంది: రాముల వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, గడివేముల: వాల్మీకి దేవాలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం


ఆదోని: భారీ భక్తజన సందోహం మధ్య శోభాయాత్ర

ఊరూవాడా 'అయోధ్య' వేడుక


నంద్యాల: సంజీవనగర్ రామాలయంలో ముత్యాలతో అలంకారం

అయోధ్య రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట వేడుక నేపథ్యంలో సోమవారం పట్టణాలు, పల్లెల్లో పండుగ వాతావరణం కనిపించింది. రామాలయాలను ప్రత్యేకంగా అలంకరించి నీలమేఘ శ్యాముడికి పూజలు నిర్వహించారు. దశరథ తనయుడి చిత్రపటాలతో ఊరూవాడా శోభాయాత్రలు వైభవంగా జరిపారు. జై శ్రీరామ్ అంటూ నినదించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ముఖ్యమైన పట్టణాల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి అయోధ్యలో జరిగే ప్రాణప్రతిష్ట ఘట్టాన్ని సామూహికంగా వీక్షించారు. ప్రముఖ ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగవైభవంగా జరిపారు. పలుచోట్ల రథోత్సవాలు కనుల పండువగా సాగాయి. ఆలయాల్లో భజనలతో శ్రీరామున్ని భక్తులు కీర్తించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు సైతం పాల్గొన్నారు.

–సాక్షినెట్‌వర్క్


నందికొట్కూరు: ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు


కర్నూలు: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అయోధ్య నమూనా ఆలయం


కర్నూలు: నమూనా ఆలయంలో ఉత్సవ విగ్రహాలు


కర్నూలు: భక్తజన సందోహం మధ్య సాగుతున్న శోభాయాత్ర


కర్నూలు: రాంబొట్ల ఆలయంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై అయోధ్య ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


ఆళ్లగడ్డ: అహోబిలంలో సీతారాముల కల్యాణ ఉత్సవ విగ్రహాలు


వెల్దుర్తి: పుల్లగుమ్మిలో రామభజన చేస్తున్న భక్తులు


దేవనకొండ: సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వేషధారణలో చిన్నారులు


నందికొట్కూరు: మల్యాలలో సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


నంద్యాల: కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో నృత్య ప్రదర్శన

క్రికెట్ విజేత పోలీసు టీమ్

నంద్యాల(న్యూటౌన్)/పాణ్యం: ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో సోమవారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో పోలీసు టీమ్ విజేతగా నిలిచింది. రెవెన్యూ, పోలీసు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. రెవెన్యూ జట్టుకు కెప్టెన్‌గా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, వైస్ కెప్టెన్‌గా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, పోలీసు జట్టుకు కెప్టెన్‌గా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, వైస్ కెప్టెన్‌గా ఏఎస్పీ వెంకటరాముడులు ప్రాతినిధ్యం వహించారు. విధుల్లో నిత్యం బిజీగా ఉండే కలెక్టర్, ఎస్పీ బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ముందుగా టాస్ గెలిచిన పోలీసు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 15 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 152 పరుగులు సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ ప్రారంభించిన రెవెన్యూ జట్టు 15 ఓవర్లు ముగిసే సరికి రెండు వికెట్లు 94 పరుగులు మాత్రమే చేసింది. 58 పరుగుల తేడాతో పోలీసు జట్టు విజేతగా నిలిచింది. రెవెన్యూ జట్టులో కలెక్టర్ 27 రన్‌లు సాధించి మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం విజేతగా నిలిచిన జట్టుకు కలెక్టర్ మనజీర్ జిలానీ ట్రోఫీని అందజేశారు. రన్నర్‌గా నిలిచిన రెవెన్యూ జట్టుకు ఎస్పీ ట్రోఫీని అందచేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, జిల్లా పరిషత్ డెప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


విజేతగా నిలిచిన ఎస్పీ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

ఆర్‌టీఏ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్లు

- ఏసీబీ అధికారుల దాడులతో వెలుగులోకి
- ఎంవీఐ వద్ద రూ.2,02,890 అనధికారిక నగదు స్వాధీనం
- ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వసూళ్ల దందా
- టోల్ ఫ్రీ నెంబర్ 14400కు సమాచారంతో తనిఖీ


ఆర్‌టీఏ చెక్‌పోస్టులో ఏసీబీ తనిఖీల్లో పట్టుబడిన ఎంవీఐ సునీల్ కుమార్

కర్నూలు: పంచలింగాల వద్ద ఉన్న అంతర్‌రాష్ట్ర ఆర్‌టీఏ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు తేల్చారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సీఐలు తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, వంశీనాథ్, ఎస్ఐ సుబ్బరాయుడు, హెడ్ కానిస్టేబుల్ దొరబాబుతో పాటు మరో 15 మంది సిబ్బంది ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉండి సోమవారం సాయంత్రం వరకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. విధులు నిర్వహిస్తున్న మోటర్ వాహనాల తనిఖీ అధికారి (ఎంవీఐ) జె.సునీల్‌కుమార్ వద్ద అనధికారికంగా ఉన్న రూ.2,02,890 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాన్ని వాహనదారుల నుంచి అక్రమంగా వసూలు చేసినట్లు గుర్తించారు. సునీల్ కుమార్‌ను పలు విధాలుగా ప్రశ్నించి సమాధానం రాబట్టారు. సమీప గ్రామాలకు చెందిన ఐదుగురు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రైవేటు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకుని ఎంత కాలంగా పనిచేస్తున్నారు? పని చేసినందుకు రోజుకు ఎంత జీతం చెల్లిస్తున్నారు? తదితర విషయాలపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన టోల్‌ఫ్రీ 14400కు ఒక బాధితుడు చెక్‌పోస్టులో జరుగుతున్న అక్రమ వసూళ్లపై గత నెలలో ఫిర్యాదు చేశాడు. అలాగే వాహనదారుల నుంచి కూడా ఫిర్యాదులు అందడంతో ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి అనుమతితో సోదాలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు.

నగదు రహిత విధానం అమలులో ఉన్నప్పటికీ వసూళ్లు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై నుంచి ఈ చెక్‌పోస్టులో నగదు రహిత విధానాన్ని అమలులోకి తెచ్చింది. చెక్‌పోస్టులో చెల్లించాల్సిన బార్డర్ ట్యాక్స్, టెంపర్వరీ పర్మిట్ ఫీజు, వలంటరీ ట్యాక్స్, అపరాధ రుసుం తదితర రకాల చెల్లింపులు పూర్తిగా నగదు రహిత విధానంలోనే చెల్లించాల్సి ఉంది. అయితే ఆ విధానానికి స్వస్తి చెప్పి అధికారులు నగదు రూపంలో వసూలు చేస్తుండటంతో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు 14400కు జిల్లా నుంచి తరచూ ఫిర్యాదులు వెళ్తున్నాయని డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

ఐదేళ్లలో మూడవసారి...

ప్రభుత్వం ఎంతగా నియంత్రిస్తున్నప్పటికీ రవాణా శాఖలో వసూళ్ల పర్వం ఆగడం లేదు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై తిరిగే వాహనాలపై చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన అధికారులే సొంత జేబులు నింపుకుంటున్నట్లు ఏసీబీ తనిఖీల్లో బయటపడింది. గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న ఒక లారీ నుంచి రూ.500 మామూళ్లు తీసుకుని వదిలేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. దాని సామర్థ్యం 35 టన్నులకు గాను 61 టన్నుల లోడ్‌తో వెళ్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. 26 టన్నులు ఎక్కువగా ఉన్నప్పటికీ కేవలం రూ.500 మామూలు తీసుకుని వదిలేసినట్లు అధికారులు గుర్తించారు. అధిక లోడ్‌కు ప్రభుత్వానికి రూ.78 వేలు ఆదాయం వస్తున్నప్పటికీ కేవలం రూ.500 తీసుకుని వదిలేసినట్లు అధికారులు గుర్తించారు. చెక్‌పోస్టులో జరుగుతున్న అక్రమ వసూళ్లపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ చెక్‌పోస్టుపై గత ఐదేళ్ల కాలంలో మూడుసార్లు ఏసీబీ తనిఖీలు జరిగాయి. ప్రైవేటు వ్యక్తులతో పాటు ఎంవీఐ డ్రైవర్, హోంగార్డు కూడా వసూళ్ల దందాకు సహకరించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించి నివేదిక రూపొందించారు. విద్యాశాఖకు చెందిన ఇద్దరు అధికారులతో పాటు డీటీసీ శ్రీధర్‌ను కూడా అక్కడికి పిలిపించి వారి సమక్షంలో (మధ్యవర్తులు) పంచనామా నిర్వహించారు.

'సెబ్'లో భారీగా బదిలీలు

కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో భారీగా బదిలీలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు సీఐ, ఎస్ఐలకు స్థానచలనం కలిగింది. జిల్లాలో 14 సెబ్ స్టేషన్లు, 6 చెక్‌పోస్టులు ఉన్నాయి. ఆయా స్టేషన్లు, చెక్‌పోస్టులలో మూడేళ్లుగా పనిచేస్తున్న వారితో పాటు సొంత జిల్లాకు చెందిన వారిని కూడా సీమ జోన్(ఫోర్త్) పరిధిలోని మరో జిల్లాకు బదిలీ చేశారు. సీమ జోన్ పరిధిలోని జాయింట్ డైరెక్టర్లు, సెబ్ డిప్యూటీ కమిషనర్(ఏటీపీ)తో కలసి కసరత్తు చేసిన జాబితాను కమిషనర్‌కు పంపగా ఆమోదించిన జాబితాను ఆదివారం విడుదల చేశారు.

ఏఆర్ విభాగంలో ..

పోలీసు శాఖ ఆర్మ్‌డ్ రిజర్వుడ్ విభాగంలో ఆర్ఎస్ఐలకు భారీగా స్థానచలనం కలిగింది. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీమ జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మొత్తం 49 మంది ఆర్ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 మంది ఆర్ఎస్ఐలు మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు.

ఉమ్మడి జిల్లాకు బదిలీపై వచ్చిన అధికారులు.

పేరు	పనిచేసిన స్థానం	బదిలీ స్థానం
రాజేంద్రప్రసాద్	స్టేట్ హెడ్ క్వార్టర్	సెబ్ స్టేషన్, కర్నూలు
రామాంజనేయులు	సెబ్ స్టేషన్, పులివెందుల	సెబ్ స్టేషన్, కోడుమూరు
భార్గవ రెడ్డి	సెబ్ స్టేషన్, మడకశిర	సెబ్ స్టేషన్, ఎమ్మిగనూరు
విన్నీ లత	సెబ్ స్టేషన్, ఎల్ఆర్.పల్లి	సెబ్ స్టేషన్, ఆదోని
సువర్ణ లత	కొడికొండ చెక్ పోస్ట్	సెబ్ స్టేషన్, పత్తికొండ
మహబూబ్ బాషా	క్యాటిల్‌ఫామ్ చెక్ పోస్ట్	సెబ్ స్టేషన్, కోసిగి
సోమశేఖర్	స్టేట్ హెడ్ క్వాటర్	సెబ్ స్టేషన్, ఆలూరు
నరసా నాయుడు	ఇంటెలిజెన్స్ వింగ్ (ఏటీపీ)	డీటీఎఫ్, కర్నూలు
ఎస్.ఎం.రఫీ	నరహరిపేట చెక్‌పోస్ట్	ఇంటెలిజెన్స్‌వింగ్, కర్నూలు
తిరుమలయ్య	సెబ్ స్టేషన్, తిరుమల	పంచలింగాల చెక్‌పోస్ట్
విశ్వేశ్వర రావు	సెబ్ స్టేషన్, నాగలాపురం	పెద్దహరివాణం చెక్‌పోస్ట్
మల్లిక	సెబ్ స్టేషన్, మొలకలచెరువు	సుంకేసుల చెక్‌పోస్ట్
శ్రీధర్	డీటీఎఫ్, పుట్టపర్తి	హాళగుంద చెక్‌పోస్ట్
చెన్నారెడ్డి	సెబ్ స్టేషన్, ముద్దనూరు	బాపురం చెక్‌పోస్ట్
చంద్రశేఖర్	సెబ్ స్టేషన్, చిత్తూరు రూరల్	ఛత్రగుడి చెక్‌పోస్ట్
వై.జోగేంద్ర	సెబ్ స్టేషన్, చిత్తూరు	సెబ్ స్టేషన్, బనగానపల్లె
విజయ కుమార్	సెబ్ స్టేషన్, తిరుపతి	డీటీఎఫ్, నంద్యాల
విశ్వనాథ్ రెడ్డి	సెబ్ స్టేషన్, కడప	సెబ్ స్టేషన్, నంద్యాల
వర్ధనా దేవి	సెబ్ స్టేషన్, నగిరి	సెబ్ స్టేషన్, కోవెలకుంట్ల
మారుతి రావు		సెబ్ స్టేషన్, ఆత్మకూరు
జయనాథ రెడ్డి	సెబ్ స్టేషన్, తనకల్లు	సెబ్ స్టేషన్, డోన్
సీతారామి రెడ్డి	సెబ్ స్టేషన్, పుంగనూరు	సెబ్ స్టేషన్, నందికొట్కూరు